కనీస పెన్షన్ చెల్లించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈపీఎస్ పెన్షనర్స్‌కు కనీస పెన్షన్ చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్ర) జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ ఈపీఎఫ్‌వో కార్యలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ మేకు ఈపీఎఫ్‌వో కార్యాలయం పీఆర్వో ఆడెపు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా చందుపట్ల జనార్దన్‌రెడ్డి మాట్లా డుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు ఇతర ప్రైవేట్ రంగాల్లో సేవలందించి రిటైర్ అయిన 37 లక్షల మంది కార్మికులు వెయ్యి రూపాయల పెన్షన్ కూడా పొందడం లేదన్నారు. 2014 సంవత్సరంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కనీస బేసిక్ పెన్షన్‌ను మూడు వేలుగా నిర్ణయించిందన్నారు. దానికి డీఏ కలిపి చేస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు ఆ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో టాప్ర జిల్లా శాఖ కోశాధికారి ఇరుమళ్ల తిరుమ లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెల మల్లయ్య, సయ్యద్ మునీరుద్దీన్, ఎడ వెల్లి మోహన్‌రెడ్డి, కర్నె భూమయ్య, దేవేందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, పింగిలి రవీందర్ రెడ్డి, బాస్కరాచారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

21న జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోటీలు

కరీంనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 21న జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఏడు అంశాల్లో జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోటీలు, సైన్స్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు.

జోరుగా ధాన్యం కొనుగోళ్లు



- ఇప్పటికే 1.05 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ. 213.85 కోట్లు
- రైతులకు చెల్లించింది రూ. 138.5 కోట్లు
- అందుబాటులో లేని టార్పాలిన్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరమయ్యాయి. మొంథా తుఫానుతో పొలాల్లో నీరు చేరి వరి కోతలు ఆలస్యమయ్యాయి. పొలాల్లో బురద ఇప్పటికీ ఎండకపోయినా రైతులు ట్రాక్ హార్వెస్టర్ల ద్వారా పొలాలు కోపిస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం ఎక్కువగా వస్తున్నది. జిల్లాలో ఏర్పాటు చేసిన 325 కేంద్రాల్లో ఏడు కేంద్రాలు మినహా అన్నిప్రాంతాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 16,783 మంది రైతులకు చెందిన 1,05,149 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యం విలువ 251.2 కోట్ల రూపాయలు. ఇప్పటికే 138.5 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 112.7 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉన్నది.

ధ్రువీకరణలో మిల్లర్లు, కొనుగోలు వివరాల నమోదులో జాప్యం

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలిస్తున్నారు. మిల్లర్ల నుంచి ధాన్యం తమకు చేరినట్లు ధ్రువీకరించడంలో కొంత జాప్యం జరుగుతుండడంతో సివిల్ సప్లయిస్ శాఖ నుంచి రైతుల ఖాతాల్లో డబ్బు వెంట వెంటనే జమ కావడం లేదని తెలుస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో కూడా కొంత ఆలస్యం జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.

క్వింటాల్‌కు నాలుగు కిలోలు అదనం

ధాన్యం కొనుగోలు సమయంలో గోనె సంచిబరువు కలుపుకుని 40 కేజీల తూకం వేయాల్సి ఉండగా 42 కేజీల ధాన్యం తీసుకుంటున్నారని రైతులు అంటున్నారు. ఒక్కో క్వింటాలుపై నాలుగు నుంచి ఐదు కేజీల ధాన్యం తరుగు పేరిట ఎక్కువగా తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 2,75,398 ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో ఈ సీజన్‌లో 2,75,398 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు 21 క్వింటాళ్ల నుంచి 22 క్వింటాళ్ల చొప్పున సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అందులో విత్తన పంట, రైతుల సొంత అవసరాలకు నిల్వ చేసుకునే ధాన్యంతోపాటు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసే ధాన్యం మూడు లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుంది. మరో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తారని భావించారు. జిల్లా వ్యాప్తంగా 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కోతలు ఆలస్యం కావడంతో ఇప్పటి వరకు 1,05,148 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చింది.

వాతావరణ పరిస్థితులపై ఆందోళన

అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉన్నా తేమశాతం అధికంగా వస్తోంది. రైతులు కొనుగోలు

(మిగతా 8వ పేజీలో)

నిలిచిన పత్తి కొనుగోళ్లు..

- వెలవెలబోయిన జమ్మికుంట మార్కెట్ యార్డు



మూసిఉన్న జమ్మికుంట మార్కెట్ మెయిన్ గేట్

జమ్మికుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిత్యం తెల్ల బంగారంతో కళకళలాడే జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డు జిన్నింగ్ మిల్లర్ల సమ్మెతో సోమవారం వెలవెలబోయింది. జమ్మికుంటలో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే జిన్నింగ్ మిల్లులు బోసిపోయాయి. ఈ సందర్భంగా జిన్నింగ్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దోనకొండ మల్లారెడ్డి మాట్లాడుతూ ఎల్-1, ఎల్-2, ఎల్-3, నిబంధనలతో తమకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సీసీఐ ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని నిబంధన విధించడం సమంజసం కాదన్నారు. కపాస్ కిసాన్ యాప్‌తో రైతులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. చాలా మంది రైతులకు స్మార్ట్ ఫోన్లు లేక పోవడం వల్ల తక్కువ ధరకు పత్తి అమ్ముకుని నష్టపోతున్నారన్నారు. గతంలో మాదిరిగానే సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం, సీసీఐ ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లినా స్పందించలేదన్నారు. అందుకోసమే సమ్మె బాట పట్టామని, తమ డిమాండ్లు నెరవేరే వరకు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

రైతులు సహకరించాలి

- మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి రాజు

జిన్నింగ్ మిల్లుల సమ్మెతో మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు స్లాట్ బుక్ చేసుకోవద్దు. కొనుగోళ్లు ప్రారంభమైతే ఒక రోజు ముందు రైతులకు సమాచారం అందిస్తామన్నారు. అప్పటి వరకు రైతులు పత్తి తీసుకు రావద్దు. రైతులు ఇందుకు సహకరించాలి.

ప్రత్యేక లోక్ అదాలత్‌కు విశేష స్పందన

- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, ఈ అదాలత్ ద్వారా మొత్తం 1,280 కేసులను పరిష్కరించినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఓ ప్రకటనలో తెలిపారు. 257 ఎఫ్ఐఆర్ కేసులు, 23 ఈ-పెట్టి కేసులు, 1008 డ్రంకెన్‌డ్రైవ్, మోటార్ వెహికల్ చట్టం కేసులు, 57సైబర్ కేసులకు పరిష్కారం లభించిందన్నారు. సైబర్ కేసుల్లో 51.39 లక్షల రిఫండ్‌కు కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, కోర్టు డ్యూటీ అధికారులను సీపీ అభినందించారు.

స్టూడెంట్స్ క్లబ్ విధానం స్ఫూర్తిదాయకం

- రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు చేయాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, అన్ని రంగాల్లో వారు రాణించేందుకు స్టూడెంట్స్ క్లబ్‌ల ఏర్పాటు విధానం రాష్ట్రానికి స్ఫూర్తిదాయకమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ విధానాన్ని రాష్ట్రమంతా అమలు చేయాలని ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని తెలిపారు. జిల్లాలోని 172 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన, స్నేహిత, ఈకో స్పోర్ట్స్ కాన్షియస్‌నెస్, రిటరల్లి ల్యాథర్న్ క్లబ్బులలో సభ్యులుగా ఉన్న 2566 మంది విద్యార్థులకు బండి సంజయ్ కుమార్ టీ షర్ట్స్, బ్యాడ్జీలను సోమవారం అందించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 578 పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లను అంద జేశారు. కరీంనగర్ కళాభారతిలో నిర్వహిం చిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన క్లబ్బుల విధానం ద్వారా విద్యార్థుల్లో లీడర్ షిప్, ప్రశ్నించే తత్వం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహి స్తున్న కలెక్టర్‌ను, విద్యాశాఖ అధికారులను ఆయన అభినందించారు. విద్య, వైద్య అభి వృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా అందజేస్తామని, మరిన్ని సీఎస్ఆర్ నిధులను తెప్పించి అభివృద్ధికి ఉపయోగిస్తామన్నారు. ప్రతి ఏడాది తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేస్తానని, ప్రతి సంవ త్సరం పదో తరగతి పరీక్ష ఫీజు తానే చెల్లిస్తానని వెల్లడించారు. అన్ని ప్రభుత్వ పాఠ శాలలకు గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లు అందజేస్తా మన్నారు.



ఎల్‌పీజీ సిలిండర్లు పంపిణీ చేస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టర్ పమేలా సత్పతి మాట్లా డుతూ పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రతి క్లబ్ విద్యార్థికి ప్రత్యేక బాధ్యత ఉందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కల్పించిన సౌకర్యాలను విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగా ల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో డీ ఈవో మొండయ్య, విద్యాశాఖ కోఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, కృపారాణి పాల్గొన్నారు.

ఆర్‌ఎంవోగా బాధ్యతల స్వీకరణ

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్‌ఎం వో (రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్)గా డాక్టర్ జవహర్ లాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహించిన ఆయన పదో న్నతిపై రెగ్యులర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్‌ఎంవోగా నియమితులయ్యారు. ఈ సంద ర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, డాక్టర్ నవీన, డాక్టర్ నరేందర్ ఇతర వైద్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



ఆర్‌ఎంవోను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి

ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి కన్నుమూత

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ)రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండ సురేందర్ రెడ్డి (60) కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీలో తన స్వగృహంలో సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన కొంత కాలంగా కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.



బండ సురేందర్ రెడ్డి (ఫైల్)

సురేందర్‌రెడ్డిది జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు స్వ గ్రామం కాగా కరీంనగర్‌లో స్థిరపడ్డారు. ఆయన 2011 నుంచి 2014 వరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత 2014 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. 2023లో జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. చాలా మంది రాజ కీయ నాయకులకు తన పార్టీ తరఫున సింహం గుర్తుతో ఎన్నికల్లో టికెట్ ఇచ్చి ఆశ్రయం కల్పిం చారు. అందరూ ఆయనను సింహం సురేందరన్న అంటూ అభిమానంగా పిలిచేవారు బండ సురేం దర్‌రెడ్డికి భార్య, కూతురు ఉన్నారు. బండ సురేందర్‌రెడ్డి మరణంపై పలువురు రాజకీయ పార్టీల నాయకులు సంతాపాన్ని తెలిపారు. ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి మృతి చెందటంపట్ల మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ సంతాపం తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న సురేందర్‌రెడ్డి సోమవారం తుది శ్వాస విడవడం విచారకరమన్నారు. పార్టీకి, ప్రజా సేవకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు వినోద్‌కుమార్ సానుభూతిని తెలిపారు.

ఉక్కు మనిషికి ఘన నివాళి

- నగరంలో యూనిటీ మార్చ్

భగత్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా నగరంలో యువత, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధికారులు ఘన నివాళి అర్పించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన మైభారత్ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో యూనిటీ మార్చ్ సోమవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఎస్సారార్ కళాశాల నుంచి కళాభారతి వరకు మార్చ్ జరిగింది. పాదయాత్రలో విద్యార్థులంతా దేశ భక్తి నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ వెంకట్‌రాంబాబు, బి రవీందర్, జి శ్రీనివాస్, మాడ వెంకట్‌రెడ్డి, డి సంపత్, ఎస్సా రార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గంగాధర్, డీవైఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.



యూనిటీ మార్చ్‌లో పాల్గొన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు, విద్యార్థులు



ఎస్సారార్ కళాశాల వద్ద యూనిటి మార్చ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

దేశాన్ని పట్టి పీడిస్తున్న కుటుంబ వారసత్వ రాజకీయాలు

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశాన్ని కుటుంబ వారసత్వ రాజకీయాలు పట్టి పీడిస్తున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సర్దార్ వల్లభాయి పటేల్ 150 జయంతి ఉత్సవాల నేపథ్యంలో నగరంలో నిర్వహించిన యూనిటీ మార్చ్ అనంతరం విలేకరులతో మాట్లాడారు. సర్దార్ వల్లభాయి పటేల్ ఆశయాలను నెరవేర్చేందుకు నేటి యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. భారత దేశ ఐక్యత కోసం తన జీవిత సర్వస్వాన్ని ధారపోసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అన్నారు. పటేల్ లేక పోతే తెలంగాణకు విముక్తి కలిగేది కాదన్నారు. భారతదేశ ఐక్యత కోసం తన జీవిత సర్వస్వాన్ని ధారపోసిన మహనీయుడు వల్లభాయి పటేల్ అన్నారు.

దేశంలో ఐఏఎస్, ఐపీ ఎస్ వ్యవస్థను స్థాపించడంలో పటేల్ కీలక పాత్ర పోషించారన్నారు. దేశ వ్యాప్తంగా కేం ద్ర ప్రభుత్వం అక్టోబరు 31 నుంచి నవంబరు 25 వరకు అన్ని జిల్లాల్లో సర్దార్ ఐక్యత మార్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.

శిశు మరణాలను తగ్గించడమే లక్ష్యం

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణ అన్నారు. నవజాత శిశు సంరక్షణ వారోత్సవాలను ఈనెల 15 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాలల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ వారోత్సవాల్లో నవజాత శిశువుల సేవలు, సంరక్షణ తదితర విష యాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన సోషల్ అవేర్‌నెస్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యుమోనియా సక్సెస్‌ఫుల్(సాన్) కార్యక్ర మాన్ని ఫిబ్రవరి నిర్వహిస్తామని తెలి పారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా, కళ్యాణ్, సుధాకర్, మల్లికార్జున్, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి పాల్గొన్నారు.

నిరంతర ఉద్యమాలకు సిద్ధం కావాలి

గణేశ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ఎర్రజెండాలన్నీ ఏకమై నిరంతర ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రచార జాతా సోమవారం కరీంనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమరశీల పోరాటాలతో ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బస్సుజాతా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజావాణికి 288 దరఖాస్తులు...



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 288 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారు లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీవోలు మహే శ్వర్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ఆరు నెలలకు సంబంధించిన వేతనం ఇప్పించాలి

తనకు ఆరు నెలల నుంచి రావాల్సిన సగం వేతనాన్ని ఇప్పించాలని ఉపాధ్యా యురాలు టి శారదా రెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను కరీంనగర్ రూరల్ మండలంలోని దుబ్బపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణకాలనీలోగల ఎంపీయూపీఎస్‌లో పనిచేస్తున్న కాలంలో 20 22 సెప్టెంబరు 22 నుంచి 2023 మార్చి 15 వరకు ప్రభుత్వ అనుమతితో అమెరికా వెళ్లినట్లు తెలిపారు. ఆ ఆరు నెలలకు సంబంధించిన సగం వేతనం ఇవ్వలేదన్నారు. ఈ విషయంపై 2024 జూన్ 4న జిల్లా విద్యాధికారి, ఆర్‌జేడీ వరంగల్, 2025 ఆగస్టు 4న కలెక్టర్, ఈనెల 4న డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు వినతి పత్రాలు అందజేశానని తెలిపారు. అయినా తన సమస్యను పరిష్కరించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ తగిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..

కారు.. బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని తిమ్మాపూర్ శివారులో ఆదివారం అర్ధరాత్రి బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో బంక అరుణ్(23)అనే యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాలరూరల్ ఎస్సై ఉమాసాగర్ కథనం ప్రకారం.. బుగ్గారం మండలం శెకల్ల గ్రామానికిచెందిన బంక అరుణ్ తనస్నేహితులైన అజయ్, విష్ణుతోకలిసి బైక్‌పై శెకల్ల గ్రామం నుంచి జగిత్యాల వైపు పనినిమిత్తం వస్తున్నారు. ఈ క్రమంలో జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోగల చిన్నగట్టు వద్ద గంగాధర ప్రాంతానికి చెందిన కారు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొనగా బైక్‌పై వెనుక కూర్చున్న బంకఅరుణ్ అక్కడిక్కడే మృతిచెందాడు. అజయ్, విష్ణులకు తీవ్రగాయాలైనట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. వీరిని మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి బంక శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● **ఇద్దరి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది..**

రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అజయ్, విష్ణులకు 108సిబ్బంది ఈఎంటీ మంచాల మానస, పైలట్‌రాజు అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స నిర్వహించి తక్షణమే ప్రభుత్వఆస్పత్రికి తరలించి ఇద్దరి ప్రాణాలను కాపాడారు. బాధితకుటుంబసభ్యులు 108సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో.. యువకుడి దుర్మరణం


శ్రీనివాస్(ఫైల్)

తిమ్మాపూర్ : మండలంలోని రామకృష్ణ కాలనీ వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రాజీవ్ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో కళ్లెం శ్రీనివాస్(18) మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. రామకృష్ణ కాలనీకిచెందిన కళ్లెం శ్రీనివాస్ ఐటీఐ చదువు తున్నాడు. సోమవారం స్థానిక శివాలయంలో పూజచేసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో హైదారాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు అతివేగంగా వచ్చినటిప్పర్ బైక్‌నుఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న శ్రీనివాస్ టిప్పర్ వెనక టైర్లకింద పడిపోయాడు. టిప్పర్‌టైర్లు శ్రీనివాస్ తలపై, ఛాతీపైనుంచి వెళ్లాయి. శ్రీనివాస్ తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏడేళ్లక్రితం శ్రీనివాస్ తండ్రి కూడా రామకృష్ణ కాలనీ వద్దే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

శంకరపట్నం: శంకరపట్నం మండలం తాడికల్ శివారులో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఆటోఢీ కొట్టిన ఘటనలో తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి గట్టయ్య(73) మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి గట్టయ్య తన ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పని నిమిత్తం కేశవపట్నం వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో తాడికల్‌లోని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వెనుకనుంచి ఆటోడ్రైవర్ వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో గట్టయ్య రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొని, పక్కనఉన్న ట్రాక్టర్ కల్టివేటర్‌పై పడ్డాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గట్టయ్య కూతురు కవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కన్నుమూత

పెద్దపల్లి రూరల్ : మండలంలోని రాఘవ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి స్టేజీవద్ద కారు ఢీకొని సింగ రేణి రిటైర్డ్ కార్మికుడు మృతిచెందాడు. పెద్దపల్లిరూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చొప్పల నాగరాజు(72) కుమారునితో సోమవారం పెద్దపల్లిలో కొనుగోలు చేసిన భూమిని చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. గొల్లపల్లి స్టేజీ వద్ద వాహనాన్ని యూటర్న్ చేస్తున్న క్రమంలో గోదావరిఖని నుంచి పెద్దపల్లికి వస్తున్న కారు ఢీకొనడంతో నాగరాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారునికి గాయాల య్యాయి. సంఘటనస్థలాన్ని ట్రాఫిక్‌సీఐఅనిల్‌కుమార్, రూరల్‌పోలీసులు పరిశీలించి మృతదేహన్ని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్యలక్ష్మీ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లుఎస్ఐమల్లేష్ తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి


బుచ్చవ్వ(ఫైల్)

తంగళ్లపల్లి : రోడ్డుపక్కన బస్సు కోసం వేచి ఉన్న మహిళను కారు ఢీకొట్టడంతో మహిళ మృతిచెందగా కారు డ్రైవర్ గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి మండలకేంద్రం ఇందిరానగర్‌కు చెందిన ముగ్గం బుచ్చవ్వ(55) కూరగాయలు విక్రయిస్తూ జీవనం గడుపుతోంది. సోమవారం తెల్లవారుజామున తంగళ్లపల్లిలోని బస్టాండ్ సమీపంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద బస్సు కోసం వేచి ఉండగా సిద్దిపేట వైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో హైదరా బాద్‌కు చెందిన కారు డ్రైవర్ మోమన్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడ్డ వారిని 108వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. బుచ్చవ్వ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మృతిచెందింది. మృతురాలికి భర్త మల్లయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి జైలు వార్డెన్ దుర్మరణం

ఓదెల, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తారకరామ కాలనీ వద్ద ఉన్న 32వ రైల్వే గేటు సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం పరకాల సబ్‌జైల్ వార్డెన్ నాగపూరి రాకేష్ రైలు నుంచి పడి మృతిచెందాడు. వరంగల్ చింతలపల్లిలో నివాసముంటున్న రాకేష్ పెద్దపల్లిలో జరిగిన మిత్రుడి వివాహానికి హాజరయ్యాడు. అనంతరం తిరుగు ప్రయాణం కోసం కాజీపేట్‌కు వెళ్లేందుకు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రాకేష్ ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు.


'షీ లీడ్స్' శిక్షణ తరగతులకు హాజరైన మహిళా కానిస్టేబుళ్లు



ధర్నాలు, నిరసనలు, ఆందోళనల సందర్భంలో నిరసనకారులను అడ్డుకోవడంలో శిక్షణ పొందుతున్న మహిళా కానిస్టేబుళ్లు

మహిళా కానిస్టేబుళ్లకు షీ లీడ్స్

● **ఇప్పటికే బ్లూకోల్ట్స్ విధుల్లో మహిళా పోలీసులు**

● **కరీంనగర్‌లో పోలీసింగ్ సంస్కరణలు**

● **క్షేత్ర స్థాయి సమస్యలపై శిక్షణ...**

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'మేమున్నాం' అనే ధైర్యాన్ని, భరోసాను మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తున్నారు కరీంనగర్ పోలీసు కమీషనరేట్‌లోని మహిళా పోలీసులు. పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో 'షీ లీడ్స్' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇదివరకు మహిళా కానిస్టేబుళ్లు ఆఫీస్ విధులకే పరిమితమయ్యేవారు. విజిబుల్ పోలీసింగ్‌లో వారి భాగస్వాములను చేసేందుకు మహిళా కానిస్టేబుళ్లకు బ్లూ కోల్ట్స్ విధులు కేటాయిస్తున్నారు. ఈ విధానం ఇప్పటికే సత్ఫలితాలనిస్తోంది. ప్రజలకు భద్రతపై మరింత ధృడమైన నమ్మకాన్ని కల్పించడంలో మహిళా బ్లూ కోల్ట్స్ కీలకపాత్ర పోషిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో సంఘటనలు ఎదురైనప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొనేలా మహిళా పోలీసులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు 'షీ లీడ్స్' కార్యక్రమాన్ని రూపొందించి శిక్షణను ప్రారంభించారు.

పోలీస్ శాఖలో విధులు నిర్వహించేవారు శారీరక ధృడత్వంతో పాటు మానసికంగానూ ధృడంగా ఉండాలి. మహిళా పోలీసులు వారిని వారు రక్షించుకునే స్థితిలో ఉన్నపుడే ప్రజలను రక్షించగలరనే ఉద్దేశంతో వంద మందికి (షీ టీంల సభ్యులతో సహా) రెండు దశల్లో కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. ఆత్మరక్షణ విద్యలో సుశిక్షితులుగా తీర్చిదిద్దడం కోసం కరాటే (అన్ ఆర్మ్ కంబాట్ కోర్స్)లో శిక్షణ ఇస్తున్నారు. ధర్నాలు, నిరసనల్లో ముఖ్యంగా మహిళా నిరసనకారులను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సున్నితమైన అంశాలను ఎలా సమర్ధంగా, మానవీయంగా నిర్వహించాలో నేర్పిస్తున్నారు. మానసిక ఒత్తిడి అధిగమించేందుకు, క్షేత్ర స్థాయి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు, పోలీసులకు మానసిక ధృడత్వాన్ని పెంచేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు.

షీ లీడ్స్ కార్యక్రమంతో ప్రజలకు మరింత దగ్గరగా.

- గౌస్ ఆలం, కరీంనగర్ పోలీస్ కమిషనర్



మహిళా పోలీసుల సేవలనుం కార్యాలయానికే పరిమితం చేయకుండా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు షీలీడ్స్ కార్యక్రమం అమలు చేస్తున్నాం. మహిళా బ్లూ కోల్ట్స్ బృందం వీధుల్లో తిరుగుతుంటే, తమకు రక్షణ ఉందనే ధైర్యం, ఆత్మవిశ్వాసం మహిళల్లో మరింత పెరుగుతుంది. ఈ శిక్షణ ద్వారా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది.



విద్యార్థిని చేతికి తీవ్ర గాయాలు

ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ప్రమాదం

కోల్‌సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం ఓదెల మేఘన(16)అనే ఇంటర్ విద్యార్థిని బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో ఆమె చేయిపై నుంచి బస్సుటైర్ వెళ్లి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. ఎన్‌టీపీసీ కృష్ణనగర్‌కు చెందిన మేఘన గోదావరిఖని శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్‌కళాశాలలో హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. గోదావరిఖని బస్టాండ్ నుంచి ఎఫ్‌సీఐ లోని ఇంటికి వెళుతున్న సమయంలో కరీంనగర్-2 డిపోకు చెందిన బస్సు ఎక్కుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గోదావరిఖని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.

ట్రాలీ - ద్విచక్ర వాహనం ఢీ

● **ఒకరికి తీవ్ర గాయాలు**

పెద్దపల్లి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ శివారులో సోమవారం ట్రాలీ, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన అజయ్ ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వస్తుండగా పెద్దపల్లి నుంచి మంథనికి వెళ్తున్న ట్రాలీ ఎదురెదురుగా ఢీకొంది. ట్రాలీ బోల్తాపడటంతో పాటు ద్విచక్రవాహన దారునికి తీవ్రగాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అతనితోపాటు ట్రాలీ డ్రైవర్‌కు గాయాలైనట్లు తెలిపారు. ఈ సంఘటనపై పెద్దపల్లి రూరల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

కూతురి హత్య కేసులో తండ్రి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన కూతురి హత్య, కొడుకుపై హత్యాయత్నం కేసులో వారితండ్రి అనవేణి మల్లేష్(38)ని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జాన్‌రెడ్డి సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన అనవేణి మల్లేష్ 15ఏళ్లుగా నగరంలోని వావిలాలపల్లి వాసవినగర్‌లో నివాసం ఉంటున్నాడు. హమాలీ పనిచేసుకుంటూ భార్య పోసవ్వ, దివ్యాంగులైన కూతురు హర్షిత, కొడుకు హర్షిత్‌ను పోషించుకుంటున్నాడు. ఆ ఇద్దరు పిల్లలు చిన్నవయస్సు నుంచి మానసిక, శారీరక అంగ వైకల్యంతో బాధపడుతున్నారు. చికిత్సకోసం అనేక ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించారు. పిల్లల ఆరోగ్య, మానసిక పరిస్థితిలో మార్పు రాలేదు. పిల్లల పరిస్థితి జీవితాంతం మారదని వైద్యులు స్పష్టం చేయడంతో నిందితుడు తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఘాతుకానికి పాల్పడ్డాడు.

● **ఘటన జరిగిన తీరు..**

ఈ నెల 15న మధ్యాహ్నం నిందితుడి భార్య మార్కెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో మల్లేష్ మొదట కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి పిల్లలకు ఇవ్వడానికి ప్రయత్నించగా వారు నిరాకరించారు. అనంతరం ఒక కాటన్ టవల్‌ను రెండు ముక్కలు చేసి వాటితో కూతురు(హర్షిత), కొడుకు (హర్షిత్) మెడకు ఉరివేశాడు. దీంతో కూతురు మరణించగా, కొడుకు స్పృహ కోల్పోయాడు. అనంతరం మల్లేష్ టవల్ ముక్కలను బయట పారేసి ఇంటినుంచి పారిపోయాడు. ఘటన తర్వాత నిందితుడు అదే సాయంత్రం కరీంనగర్ నుంచి హైదరాబాద్ జేబీఎస్‌కు చేరుకున్నాడు. అక్కడ లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. మరుసటి రోజు మంచిర్యాలకు వెళ్లి అక్కడ తిరుగుతూ పోలీసుల భయంతో తలదాచుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం ఉదయం కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మల్లేష్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనపై కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడి మొబైల్‌ఫోన్, రెండు బస్‌టికెట్లు, హత్యకు ఉపయోగించిన రెండు కాటన్ టవల్ ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

బట్టల షాపులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టుచౌరస్తా సమీపంలోని మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్‌లో సోమవారం వేకువ జామున 3గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈప్రమాదంలో కోటి రూపాయల వరకు ఆస్తినష్టం జరిగిందని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాపులో మంటలు అంటుకోగా స్థానికులు అందించిన సమాచారంతో కరీంనగర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది తెల్లవారు జామున 3 గంటలకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కరీంనగర్, మానకొండూర్ ఫైర్‌ఇంజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే షాపులో ఉన్న బట్టలు, ఫర్నిచర్, ఏసీలు దగ్ధమయ్యాయి. షాపు యజమాని సంగం రాజేశం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి అరెస్టు

సారంగాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లైంగికదాడి చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల మేరకు సారంగాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ళ చిన్నారిపై అదే గ్రామానికి చెందిన బాపు(48) అనేవ్యక్తి బాలిక ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకెళ్లి కొద్దిరోజుల క్రితం లైంగిక దాడికి పాల్పడ్డారు. దీంతో చిన్నారి ఏడ్చుకుంటు ఇంటికి వెళ్లగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగిత్యాల సీఐ సుధాకర్, ఎస్ఐ గీత నిందితుడిని అరెస్ట్ చేసి పోక్సో కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

జ్యోతినగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీపీసీ ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద రోడ్డుపై ఓ వ్యక్తి పడి పోయాడు. దీంతో అక్కడివారు 100కు డయల్‌చేసి విషయం చెప్పగానే విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ నవీన్ రావు అక్కడికి చేరుకుని, ప్రమాదవివరాలు సేకరించిబాధితుడిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆపదలో ప్రజలు వందకు డయల్‌చేస్తే పోలీసులు అందుబాటులో ఉండి సేవలందిస్తారని ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. వెంటనే స్పందించి, బాధితుడిని ఆసుపత్రికి తరలించిన కానిస్టేబుల్‌ను ఎస్ఐ అభినందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చల్లూరుకు చెందిన ఎండీ అహమ్మద్దీన్ ఏప్రిల్ 1న కరీంనగర్ రైల్వేస్టేషన్ వద్ద సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ములుగులో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రూరల్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేశారు.

ఫ్యాన్సీ నంబర్లు మరింత ప్రియం

● **భారీగా రుసుమును పెంచిన ప్రభుత్వం**

తిమ్మాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసిన వారిలో కొందరు వారికి కలిసి వచ్చే నంబర్లను దక్కించుకునేందుకు ఎంతైనా డబ్బులు వెచ్చిస్తారు. అవసరమైతే వేలంలో పాల్గొని అయిన వాటిని చేజిక్కించుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నంబర్ల కేటాయింపుపై కీలక నిర్ణయం తీసుకుంది. వాహనాలకు ఇచ్చే ప్రత్యేక (ఫ్యాన్సీ) నంబర్ల రిజర్వేషన్ కోసం ప్రస్తుతం తీసుకుంటున్న రుసుమును భారీగా పెంచింది. తెలంగాణ మోటారు వాహనాల రూల్స్ 1989లోని నియామలు, నిబంధనలను సవరిస్తూ తుది నోటిఫికేషన్‌ను జారీ చేసింది. పెంచిన రెట్లు, నంబర్లను నోటిఫికేషన్‌లో పొందుపరిచింది.

● **నంబర్ల రిజర్వేషన్‌కు చెల్లించాల్సిన రుసుము**

☑ 9999 నంబరు కావాలనుకునే వారు 1.5 లక్షల రూపాయలు చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఈ మొత్తం 50 వేలు రూపాయలుగా ఉండేది.

☑ 1, 9, 6666 ఈ నంబర్లు కావల్సిన వారు లక్ష రూపాయలు చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

☑ 99, 999, 3333, 4444, 5555, 7777 నంబర్లు కావల్సిన వారు 50,000 రూపాయలు చెల్లించాలి.

☑ 5, 6, 7, 123, 333. 369, 555, 666, 777, 1111,


తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం

1116, 1234, 2222, 2277, 2345, 2727, 3339, 3366, 3456, 3699, 4455, 4545, 4599, 6669, 6789, 4455, 4545, 4599, 6669, 6789, 8055, 8888 నంబర్లు కావాల్సిన వారు 40 వేల రూపాయలు చెల్లించాలి.

(5) 3, 111, 234, 567, 1188, 1818, 1899, 1999, 2799, 3636, 3999, 5678, 5999, 6999, 7999, 9009 నంబర్లు కావాల్సిన వారు 30 వేల రూపాయలుచెల్లించాలి.

(6).2, 4, 8, 11, 18, 27, 36, 39, 45, 55, 77, 143, 222, 405, 444, 456, 459, 786, 789, 909, 1112, 1122, 1212, 1233, 1269, 1314, 1359, 1889, 2223, 2255, 2259, 2349, 2525, 3335, 3344, 3399, 3555, 3789, 3888, 3969, 4446, 4554, 4567, 4777, 4959, 5445, 5559, 5589, 5599, 5666, 5679, 5859, 6336, 6699, 6777, 6786, 6969, 7779, 7799, 7979, 8889, 8899, 8999, 9099 నంబర్లు కావాల్సిన వారు 20వేల రూపాయలు రుసుము చెల్లించి రిజర్వ్ చేసుకోవాలి.

ఇవి కాకుండా మిగతా ఏ నంబర్ కావాలన్నా ద్విచక్ర వాహనదారులు మూడు వేలు, కార్లు, ఇతర వాహనాదారులు ఆరు వేల రూపాయలు రుసుము చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

● **నిబంధనలు..**

నంబర్ల రిజర్వేషన్‌కు సంబంధిత రవాణా శాఖ పోర్టల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

☑ మధ్నాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన బిడ్‌లను పరిశీలిస్తారు.

☑ ఒకే నంబరుకు ఒకటి కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే వారిలో అత్యధిక బిడింగ్ వేసిన వారికి నంబర్‌ను కేటాయిస్తారు.

☑ దరఖాస్తుదారుడు బిడ్ సమర్పించకపోతే చెల్లించిన రుసుమును తిరిగి ఇవ్వరు. రిజర్వేషన్ చేసుకుని వేలంలో పాల్గొన్నా నంబర్ రాకపోతే కట్టిన రుసుములో 10శాతం మినహాయించుకుని మిగతా మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు.

ర్యాష్ డ్రైవింగ్.. మారని డ్రైవర్ల తీరు

● **రోజుకో రోడ్డు ప్రమాదం**

● **పలువురికి గాయాలు**

మానకొండూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్‌తో రోజుకో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటోంది. కొంత మంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటుండగా మరికొంతమంది గాయాలతో బయ టపడి నరకయాతన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ, లారీ డ్రైవర్ల తీరు మారడం లేదని ప్రయాణికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సులు రోజుకు సుమారు 15ట్రిప్పులు ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తాయి. దీంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, వీణవంక, జమ్మికుంట మండలాలకు చెందిన పలు వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనికి తోడు మండలంలోని ఊటూరులోని మానేరు వాగు, వీణవంక మండలంలోని కోర్కల్, మల్లారెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని మానేరు వాగు నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, హైదారాబాద్ తదితర పట్టణాలకు తిరుగుతాయి. ఇసుక లారీలు పోటీ పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. మండలంలోని అన్నారం-లలితాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అక్కడ రోడ్డు గుంతలమయంగా మారింది. అయినప్పటికీ సోమవారం ఇరువైపులా ఆర్టీసీ బస్సు-లారీ డ్రైవర్లు ఒకదాని వెనుక ఒకటి అతి వేగంతో పోటీ పడడం కనిపించింది. దీంతో బస్సులోని ప్రయాణికులు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం మండలంలోని సదాశివపల్లి బస్టాండ్ వద్ద ముందు ఉన్న లారీని వెనకాల నుంచి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుమారు 15 మందికి గాయాలయ్యాయి. వేగంగా వెళ్లవద్దని విజ్ఞప్తి చేసినా సదరు ఆర్టీసీ డ్రైవర్ వినిపించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.



అన్నారం-లలితాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వంతెన దగ్గర ర్యాష్ డ్రైవింగ్‌తో వెలుతున్న బస్సు-లారీలు

పుస్తెల తాడు లాక్కెళ్లిన దొంగ అరెస్టు



దొంగను అరెస్ట్ చూపిస్తున్న టౌన్ సీఐ కృష్ణ

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లిన దొంగను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దొంగను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలోని మోహర్‌నగర్‌కు చెందిన గాదెరాణి అనే వృద్ధురాలు ఇంటిలో ఒక్కతే తలుపు దగ్గర పెట్టుకుని పడుకుని ఉండగా శాంతినగర్‌కుచెందిన మెరుగు భాస్కర్ అనేవ్యక్తి 15వతేదీన మధ్యాన్న సమయంలో తలుపులు తీసుకుని లోపలికి వచ్చి రాణి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడుతోపాటు రెండు గుండ్లు పట్టుకుని పారిపోయాడు. రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాల అధారంగా భాస్కర్ అనే దొంగను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. దొంగించిన సొమ్మును అమ్ముకోగా వచ్చిన డబ్బులు జల్సాలకు వాడుకోగా మిగిలిన డబ్బులను సీజ్ చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

జమ్మికుంట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయ మాటలు చెప్పి వివాహం చేసుకున్న ఓ యువకుడు ఆమెను గర్భిణిని చేసి ఇంటినుంచి బయటకు గెంటేయగా పోలీసులు అతడిపై పోక్సోకేసు నమోదు చేశారు. జయశంకర్ భూపాలపల్లిజిల్లా మొగుళ్లపల్లి మండలం పెద్ద కోమటిపల్లిలో చోటుచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జమ్మికుంట మండలం పాపక్కపల్లికి చెందిన బాలిక తండ్రి ఏడేళ్లక్రితం మృతిచెందాడు. అప్పటినుంచి తల్లితోపాటు అమ్మమ్మగారి ఊరైన పెద్ద కోమటిపల్లిలో ఉంటోంది. అదేగ్రామానికి చెందిన వంశీ సదరు బాలికకు మాయమాటలు చెప్పి ఈ ఏడాది మేలో పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో కట్నం, కానుకల కింద ఎకరం భూమి, నాలుగుతులాల బంగారం ఇచ్చారు. కొద్దినెలలు కలిసిఉన్న తర్వాత వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. భర్తతోపాటు అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధింపులకు దిగారు. పలుమార్లు పెద్దలసమక్షంలో పంచాయితీలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. తనను మోసగించి వివాహం చేసుకొని గర్భిణిని చేశాడని బాలిక గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన కార్యదర్శి వెంటనే పోలీస్‌లకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు పోక్సోచట్టం కింద యువకుడి పై కేసు నమోదు చేశారు. బాలికను సఖీ కేంద్రంలో చేర్పించారు.

రాత్రివేళ చెరువులో బావి తవ్వకం

● గ్రామస్థుల ఫిర్యాదుతో అడ్డుకున్న పోలీసులు

చందుర్తి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందిన వ్యక్తి రాత్రివేళలో చెరువులో అక్రమంగా వ్యవసాయ బావి తవ్విస్తుండగా గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు అడ్డుకున్నారు. చందుర్తి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని కొత్తచెరువులో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. కొత్త చెరువులో బావిని తవ్వించేందుకు మూడు రోజుల క్రితం జేసీబీ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు అడ్డుకోవడంతో పనులు నిలి పివేశారు. సోమవారం రాత్రి బావి తవ్వేందుకు పనులు ప్రారంభించగా పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకొని పనులను నిలిపి వేశారు. చెరువులోనీరు ఉండటంతో ప్రస్తుతం తిమ్మాపూర్ ఆశిరెడ్డిపల్లి రామన్నపేట, అనంతపల్లి గ్రామాల్లో వ్యవసాయబావుల్లో, బోర్లలో నీటికొరత లేకుండా ఉంది. చెరువులో బావితవ్వడంతో భూగర్భజలాలు ఇంకిపోయి బోర్లు అడుగంటే ప్రమాదంపొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చందుర్తి తహసీల్దార్ భూపతిని వివరణ కోరగా చెరువులో బావి తవ్వడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, చెరువుల్లో బావులు తవ్వరాదన్నారు. మంగళవారం బావిని తవ్వే ప్రాంతానికి సర్వేయర్‌ను పంపిస్తామని తెలిపారు.

పత్తి ఏరేందుకు వలస కూలీలు

● రైతుకు లాభదాయకం

● కర్నూలు కూలీలకు డిమాండ్



నర్సక్కపేట గ్రామంలో పత్తి ఏరుతున్న ఆంధ్ర కూలీలు

ఇల్లంతకుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి ఏరేందుకు ఇల్లంతకుంట మండలానికి ప్రతి యేటా ఏపీలోని కర్నూలు నుంచి కూలీలు వస్తుంటారు. మండలంలోని నర్సక్కపేట, జవారిపేట, గాలిపెల్లి, కేసన్నపల్లె, పత్తికుంటపల్లె, ఆరెపల్లి తదితర గ్రామాలలోని రైతులు ఎక్కువగా పత్తి సాగుచేస్తుంటారు. విత్తనాలు నాటిన నుంచి వర్షాలు వెంటాడటంతో పత్తి రైతులు కష్టాలు పెరిగిపోయాయి. పంటచేతికి అందివచ్చే దశలో మరోసారి కురిసిన వర్షాలతో పత్తి సాగు కష్టంగా మారింది. స్థానిక కూలీలు లభ్యం కాకపోవడం, కూలి, ఆటోకిరాయిలు కలుపుకొని ఒక్కొక్కరికి రూ. 450 వరకు ఖర్చు అవుతోంది. అయినా రోజుకు కేవలం 20కిలోలు మాత్రమే పత్తి ఏరుతున్నారని రైతులు వలస కూలీలను పత్తి ఏరేందుకు తీసుకువస్తున్నారు. ఈ యేడు ఏపీలోని కర్నూలు నుంచి 150మంది వలస కూలీలు నర్సక్కపేట గ్రామానికి చేరుకున్నారు. వారు నివాసం ఉండటానికి రైతుల కొట్టాలు ఇచ్చి విద్యుత్ సౌకర్యం కల్పించారు. వలస కూలీలు ఉదయం ఆరు గంటలకే చేనులోకి వెళ్లి సాయంత్రం ఆరు గంటల వరకు పత్తి ఏరుతారు. రైతులు కిలోకు రూ.15చెల్లించడమే కాకుండా ఆదివారం ఒక్కోకూలీకి పావుకిలో చికెన్ ఇస్తారు. వలస వచ్చిన కూలీలు ఎనమిది మంది కలిసి ఒక బ్యాచ్‌గా ఏర్పడి నివాసం ఉంటున్నారు. కర్నూలులో సరైన ఉపాధిలేకపోవడంతో వలస వచ్చామని వారు పేర్కొంటున్నారు. ప్రతిరోజు ఒక్కరు 50కిలోల వరకు పత్తి ఏరుతుంటారు. వర్షాల వల్ల పత్తి ఏరడం ఇబ్బందిగా మారిందని కూలీలు పేర్కొంటున్నరు. పత్తి ఏరడం పూర్తి అయిన తర్వాత సంక్రాంతికి ఇంటికి వెలుతామని పేర్కొంటున్నారు. వీరితో పాటు ఇప్పటికే పలు గ్రామాలలో ఉన్న బీహార్ కూలీలు కూడా పత్తి ఏరుతున్నారు.

పనిదొరక ఇక్కడికి వచ్చాం

- జగతపుగారి మాణిక్యమ్మ, కోటికల్, కర్నూలు



పుట్టిన ఊరును వదిలిపెట్టి రావడం బాధగా ఉన్నా అక్కడ పనిలేకపోవడంతో పత్తి ఏరడానికి వచ్చాం. రెండు నెలల పాటు పత్తి, మిరప ఏరిన తర్వాత సంక్రాంతికి ఇంటికి వెలుతాం. ఉదయం చేనులోకి వచ్చామంటే సాయంత్రం ఇంటికి వెలుతాం. కిలోకు రూ. 15చొప్పున రైతులు ఇస్తున్నారు. ప్రతి రోజు 50కిలోల పత్తి ఏరుతాం. కొట్టాలలో సరైన వసతులు లేకపోయినా సర్దుకుపోతున్నాం. కర్నూలు నుంచి వచ్చిన 150మందిమి నర్సక్కపేట గ్రామంలోనే ఉంటున్నాం.

కూలీ చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటాం

- ఏలియరాజా, పెద్దకడూరు, కర్నూలు



కూలీపని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటాం. రెండు నెలలపాటు పత్తిఏరిన తర్వాత సంక్రాంతి పండుగకు ఇంటికి పోతాం. తర్వాత గుంటూరుకు మిర్చి ఏరడానికి పోతాం. పత్తి ఏరడమే కాకుండా ఇంటికి చేర్చే బాధ్యత కూడా మాదే. వర్షాలు పడటం వల్ల పత్తి ఏరడం కష్టంగా మారి సరైన కూలి పడటం లేదు. ప్రయాణ చార్జీలు రైతులే భరిస్తారు.

స్థానిక కూలీలు లభించకపోవడం వల్లనే

- కొత్త శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నర్సక్కపేట



స్థానిక కూలీలు లభించకపోవడం వల్ల వలస కూలీలతో పత్తి ఏరిస్తున్నాం. స్థానిక కూలీలకు రూ. 350తోపాటు ఆటో కిరాయి ఇవ్వాల్సి ఉంటుంది. తక్కువ పత్తి ఏరడం వల్ల రైతులకు నష్టం జరుగుతుంది. వలస కూలీలు పత్తిని ఇంటివద్దకు చేరుస్తారు. వర్షాల వల్ల వలస కూలీల ధర కూడా పెరిగింది. ఈసారి పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సీసీఐ నిబంధనలలో కొంత సడలింపు ఇవ్వాలి.

కుటుంబ కలహాలతో భర్తను హతమార్చిన భార్య

● తల్లి సహాయంతో

గొంతుకు చున్నీ బిగించి హత్య

మల్లాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో తల్లి సహాయంతో భర్తను హతమార్చిన ఘటన మల్లాపూర్ మండలం కొత్తధాంరాజుపల్లిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మందపల్లి భూమేష్(31) అనే వ్యక్తిని అతడి భార్య విజయ తన తల్లి లక్ష్మితో కలిసి గొంతుకు చున్నీ బిగించి హత్య చేసింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి అర్బన్ కాలనీకి చెందిన భూమేష్‌కు మల్లాపూర్ మండలం కొత్తధాంరాజుపల్లి గ్రామానికి చెందిన విజయతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. భూమేష్‌కు ఇది మొదటి వివాహం కాగా, భార్య విజయ్‌కు రెండో వివాహం. భూమేష్ మెట్‌పల్లిలో ఓ షాపులో పని చేస్తున్నాడు. కొంత కాలంగా భూమేష్ తాగుడుకు బానిసై ఇంట్లో ఖర్చులకు డబ్బులు ఇవ్వకపోవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో విజయ కొన్ని నెలల క్రితం తల్లి గారి ఊరైన కొత్తధాంరాజుపల్లి గ్రామానికి వచ్చి గది కిరాయి తీసుకొని ఉంటోంది. తరువాత కొంత కాలానికి భార్య విజయ వద్దకు భూహేష్ వచ్చి కొత్తధాంరాజుపల్లిలోనే కలిసి ఉంటున్నారు. ఆదివారం మత్యం మత్తులో భూమేష్ తన భార్య విజయను కొడుతుండగా ఆమె తల్లి లక్ష్మి అడ్డుకుంది. దీంతో భూహేష్ అత్త లక్ష్మిపై దాడికి యత్నించాడు. దీంతో విసుగు చెందిన విజయ, ఆమె తల్లి లక్ష్మిలు కలిసి భూమేష్ గొంతుకు చున్నీ బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. భూమేష్ ఇంటి బయట వాకిట్లో పడి చనిపోయాడని చెప్పి బయట పడుకోబెట్టారు. భూమేష్ మృతదేహాన్ని చూసిన బంధువులు ఘటనపై అనుమానం వ్యక్తం చేశారు. ఆర్ఐ రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భక్తులు

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ సోమవారం పెరిగింది. దీంతో స్థానికలక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వస్వామి, శ్రీఅక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోటిలింగాలలో కాశీ శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా రుద్రాభిషేకం..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి, దర్శనం చేసుకున్నారు.

కోటిలింగాలలో కార్తీక సందడి..

వెల్గటూర్: మండలంలోని కోటిలింగాలలో సోమవారం కార్తీక సందడి నెలకొన్నది. భక్తులు అధిక సంఖ్యలో గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వదిలారు. అనంతరం శ్రీపార్వతీ కోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించారు. భక్తులు దీపదానాలు చేయగా ఆలయఅర్చకులు నాగరాజుశర్మ స్వీకరించారు.

ఆలయచైర్మన్ పూదరి రమేష్, ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు



అండర్-17 బాలుర విభాగంలో రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న 69వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో తెలంగాణలోని ఉమ్మడి 10జిల్లాల నుంచి దాదాపు 240మంది క్రీడాకారులు పోటీపడ్డారు. గెలుపొందిన క్రీడాకారులకు వీర్ల హనుమంతరావు బహుమతులు ప్రదానం చేశారు. అండర్-17బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా మొదటి, మెదక్‌జిల్లా రెండో, కరీంనగర్‌జిల్లా జట్టు మూడోస్థానం, బాలుర విభాగంలో ఆదిలాబాద్‌జిల్లా మొదటిస్థానం, కరీంనగర్‌జిల్లా రెండోస్థానం, వరంగల్‌జిల్లా మూడోస్థానం సాధించాయి. అండర్-14బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా మొదటిస్థానం, కరీంనగర్ జిల్లా రెండోస్థానం, మెదక్ జిల్లా మూడవస్థానం, బాలుర విభాగంలో మెదక్‌జిల్లా మొదటిస్థానం, ఆదిలాబాద్‌జిల్లా రెండోస్థానం, కరీంనగర్‌జిల్లా జట్టు మూడోస్థానం సాధించాయి. అన్నివిభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు రాజరాజేశ్వరి, పీడీ దత్తాద్రి, గ్రామకార్యదర్శి శ్యామ్, ఎస్‌జీఎఫ్‌సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వీర్‌పాల్‌రెడ్డి, శ్రీను, సత్యనారాయణ, రూపరాణి, రాజగోపాల్, రమేష్, హరికిషన్, రమణ, రాజ్‌కుమార్, పత్తి రాజిరెడ్డి, కృష్ణవేణి, స్వప్న, వనిత, అహ్మద్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సోమవారం నీటి మట్టం నిలకడగాఉంది.ఎగువప్రాంతం నుంచి 9,355 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తినీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం80.501టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టునుంచి 9,355 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్లద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతోంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మెట్‌పల్లి గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన జక్కుల అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ధర్మపురి, కోటిలింగాలలో వైభవంగా గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి 27వరోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలి పుణ్య ప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి పూజలు

కోటిలింగాలలో..

వెల్గటూర్: కార్తీకమాసం పురస్కరించుకొని కోటిలింగాల వద్ద గోదావరి హారతి కార్యక్రమం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, నాయకులు, భక్తులు, మహిళలు గోదావరినది వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మల మంత్రోచ్ఛరణల మధ్యగోదావరి మాతకు హారతి ఇచ్చారు. అంతకు ముందు శ్రీపార్వతీ కోటేశ్వరస్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గోదావరి మాతకు పూజలు చేసి కార్తీకదీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, గుమ్ముల వెంకటేష్, మెరుగు శ్రీనివాస్, గండ్ర శ్రీకాంత్ రావు, మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కోటిలింగాలలో గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ప్రశంసాపత్రంతో విద్యార్థి అమర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం మధుమాలతీ, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పెద్దూరు అమర్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం మధుమాలతి సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈ నెల 16న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్(హైజంప్) అండర్- 14 విభాగంలో విద్యార్థి అమర్ అత్యంత ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. వచ్చే నెల 4 నుంచి 7 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి అమర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీడీ అక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాంటి బయోటిక్స్ అతి వినియోగంతో పశువులకు ముప్పు

జమ్మికుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాంటి బయోటిక్స్ అతి వినియోగంతో పశువులకు ముప్పు వాటిల్లుతుందని విస్తరణ సంచాలకుడు డాక్టర్ కిషన్‌కుమార్ అన్నారు. సోమవారం పీవీనరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రాలు, సత్గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో పలు అంశాలపై కేవీకేలో రెండురోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటిబయోటిక్స్‌తో పశువులతో పాటు ప్రజలప్రాణాలకు ముప్పుతప్పదన్నారు. డాక్టర్‌వంశీకృష్ణ అధిక మోతాదులో వాడితే కలిగేనష్టాల గురించి రైతులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ అంబిక పాకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ ఎమ్ కిషన్ కుమార్, డాక్టర్ బిందుమాధురి, డాక్టర్ సాయికిరణ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కిషన్ కుమార్

వేములవాడకు పోటెత్తిన భక్తులు

● స్వామివారిని దర్శించుకున్న 50వేలకు పైగా భక్తులు ● కోడె మొక్కుకు 3గంటల సమయం



భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీభీమేశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు50 వేలకుపైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. స్వామివారికి కోడెల మొక్కులు చెల్లించేందుకు కనీసం మూడు గంటల సమయం పట్టింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి ఇబ్బందుల పాలయ్యారు. భీమేశ్వరాలయానికి ఏ వైపు నుంచి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేకపూజలు చేశారు. నిత్య అన్నదానసత్రంపై అంతస్థులో కళ్యాణం, సత్యనారాయణ స్వామివ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు స్వామి వారికి మహాలింగార్చన, కుంకుమ పూజలు, పెద్దపల్లకి సేవలు, ఆకు పూజలు చేసి భక్తి ప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో రమాదేవి, డిఈఈ రఘు నందన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. టౌన్‌సీఐ వీర ప్రసాద్, ఎస్ఐ ఎల్లాగౌడ్, ట్రాఫిక్ ఎస్ఐ రాజులు 50మంది పోలీసులచే బందోబస్తు నిర్వహించారు. కార్తీకమాసం నాల్గవ సోమవారం సందర్భంగా శ్రీరాజ రాజేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి 11మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, పరివారదేవతలకు అర్చనలు నిర్వహించారు. రాత్రి మహాలింగార్చన నిర్వహించారు.

ఎల్ఈడీ స్ర్కీన్‌పై రాజన్న దర్శనం

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విస్తరణపనులు జరుగుతున్న సందర్భంగా తాత్కాలికంగా స్వామివారి దర్శనాలు నిలిపివేయడంతో సోమవారం తూర్పు వైపున ప్రచారరథంవద్ద ఏర్పరిచిన ఎల్ఈడీ స్ర్కీన్‌పై భక్తులు రాజన్నను దర్శించుకున్నారు.

బద్దిపోచమ్మకు బోనాలు..

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. భక్తులతో బద్దిపోచమ్మ ఆలయం కిక్కిరిసిపోయింది. అమ్మవారి దర్శనానికి రెండుగంటలు పట్టింది. భక్తులు పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు.

● భక్తుల ఇబ్బందులు ..

స్వామివారి ఆర్జితసేవల టికెట్లకోసం పెద్ద ఎత్తున భక్తులు ముఖ్యబుకింగ్ కౌంటర్ వద్దకు చేరుకున్నారు. కల్యాణ ప్రాంగణం సామర్థ్యం దృష్ట్యా కేవలం 79 టికెట్లను మాత్రమే జారీచేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అసహనానికి గురైన భక్తులు ముఖ్యబుకింగ్ కౌంటర్ అద్దాలు ధ్వంసం చేశారు. కార్తీకసోమవారం కావడంతో వందలాది వాహనాలతో భక్తులు వేములవాడకు చేరుకున్నారు. గుడిచెరువు పార్కింగ్‌స్థలం వాహనాలతో నిండిపోయింది. భీమేశ్వరాలయంలో ముఖ్యబుకింగ్ కౌంటర్ వద్ద భక్తుల ఆందోళనతో ఆలయ ఈవో ఎల్. రమాదేవి తనిఖీలు నిర్వహించారు.



వేములవాడ పార్కింగ్‌లో వందలాది వాహనాలు

జోరుగా ధాన్యం కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల్లోనే ధాన్యం ఆరబోసి తేమ శాతం తగ్గగానే విక్రయిస్తున్నారు. వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. చలి గాలులు పెరగడంతో తీవ్రంగా మంచు పడుతూ ఆరబోసిన వరి ధాన్యంలో తేమ చేరుతున్నది. జిల్లాలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు 10,552 టార్పాలిన్లు అవసరమవుతాయని అధికారులు భావించారు. 6,948 టార్పాలిన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. టార్పాలిన్లు తెప్పించడానికి ప్రయత్నాలు చేసినా ఇప్పటికీ అందుబాటులోకి రాలేదని సమాచారం. దీంతో రైతులు సొంతగా ధాన్యానికి టార్పాలిన్లు తెచుకుంటన్నారు. రోజుకు మూడు వందల నుంచి నాలుగు వందల రూపాయల అద్దె చెల్లించి టార్పాలిన్లను సమకూర్చుకుంటున్నారు. ఎరో వారం రోజులు వాతావరణం ఇలాగే ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో వెంటనే టార్పాలిన్లను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

19న బీసీ రిజర్వేషన్ల సదస్సు

హుజూరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జమ్మికుంటలోని దినేష్ కన్వెన్షన్ హాల్‌లో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ రిజర్వేషన్ల సదస్సును విజయవంతం చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సదస్సు పోస్టర్, కరపత్రాన్ని ఆవిష్కరించారు.

జమ్మికుంట రూరల్: బీసీ రిజర్వేషన్ల సాధన సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం జమ్మికుంట పట్టణంలోని విస్‌డమ్ జూనియర్ కళాశాలలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య ఆవిష్కరించారు.

వీణవంక: మండల కేంద్రంలో నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు.

అంతర్జాతీయ పోటీలకు మానేరు విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ సాఫ్ట్ బేస్ బాల్ జూనియర్ చాంపియన్ షిప్-2025 పోటీలకు నగరంలోని మానేరు సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ స్వామి తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకు మహారాష్ట్రలోని షిరిడీలో జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వేల్పుల విశ్వతేజ, తోట అద్విత్ రాణించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి అభినందించారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): న్యాయ వాదుల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని బార్ కౌన్సిల్ సభ్యుడిగా పోటీ చేస్తున్న హైకోర్టు న్యాయవాది, మాజీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘునాథ్ తెలిపారు. సోమవారం కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. న్యాయ వాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే దాడులు చేసిన వారిపై కఠిన శిక్షలు ఉండేలా న్యాయవాదుల రక్షణ చట్టం ఉండాల న్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, సీని యర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల జేఏసీ కమిటీల నియామకం

కరీంనగర్ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నగర కమిటీలను నియమించారు. సోమవారం స్థానిక మంకమ్మతోటలోని విజ్ఞాన్ కోచింగ్ సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు బండ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 1వ డివిజన్ కన్వీనర్‌గా సింగతి పవన్‌కుమార్, కో కన్వీనర్‌గా కిషన్‌ప్రసాద్, లత, అశోక్‌రాజు, సంపత్, 17వ డివిజన్ కన్వీనర్‌గా బండారి రఘు, కో కన్వీనర్లుగా తరుణ్‌తేజ, కట్ల మహేందర్, గణేష్, అశోక్, 18వ డివిజన్ కన్వీనర్‌గా కాంతాల మల్లారెడ్డి, కో కన్వీనర్లుగా దూస లక్ష్మి, నారాయణ, సూర్ల రాజు, బండారి లక్ష్మణ్, 45వ డివిజన్ కన్వీనర్‌గా సంగెం వీర బ్రహ్మం, కో కన్వీనర్లుగా ఓంప్రసాద్, తుమ్మ శ్రీనివాస్, ఎండీ జావీద్, అజీమ్, 13వ డివిజన్ కన్వీనర్‌గా రామగిరి దామోదర్ కో కన్వీనర్లుగా మల్లేశం, గౌరయ్య శ్రీనివాస్, 11వ డివిజన్ కన్వీనర్‌గా సరోజన, కో కన్వీ నర్లుగా శ్రీనివాసరావు, శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బొత్తా వెంకటమల్లయ్య, ప్రధానకార్యదర్శి దుర్గ మారుతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని సత్యనారాయణ, మహిళ అధ్యక్షురాలు కవిత, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, వీరబ్రహ్మం, బండారి రఘుతరుణ్, సరోజన, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

సుభాష్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనమైన బొమ్మకల్ పరిధిలోని రజ్వీచమన్, సిటిజన్ కాలనీలలో కనీస మౌళిక వసతులను కల్పించాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సయ్యద్ ముజఫర్, సలీమొద్దీన్, సయ్యద్ అఫ్జల్, మజాహర్ అహ్మద్, మహమ్మద్ మోయిన్ పాల్గొన్నారు.

భారత గడ్డపై కమ్యూనిస్టుల వందేళ్ల ప్రస్థానం

తిమ్మాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత గడ్డపై కమ్యూనిస్టులది వందేళ్ల ప్రస్థానమని సీపీఐ జాతీయ నాయకుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి కొనియాడారు. డిసెంబరు26న ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐ వంద సంవత్సరాల ఉత్సవాల ముగింపు బహిరంగ సభ సందర్భంగా చేపట్టిన బస్సు జాత సోమవారం మండ లలోని ఇందిరానగర్‌కు చేరుకుంది.

చిగురుమామిడి: సీపీఐ జాతా సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పేదోడి కష్టాలు, దోపిడీ వ్యవస్థ ఉన్నంత వరకు ఎర్ర జెండా పార్టీలు ప్రజల మధ్యలోనే ఉంటాయన్నారు.

ధూప దీప నైవేద్యానికి ఎంపిక

సైదపూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి స్వయంభూ మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం ధూప దీప నైవేద్యానికి ఎంపికైనట్లు కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్(ఎఫ్ఏసీ) ఉత్త ర్వులు జారీ చేసినట్లు ఆలయ చైర్మన్ సారబుడ్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇందు కోసం కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్‌ను జిల్లాగా ప్రకటించాలి

హుజూరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాగా ప్రకటించాలని జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ పాత తాలూకాగా పేరుగాంచిన హుజూరాబాద్‌ను చుట్టుపక్క ప్రాంతాలను కలుపుకొని కొత్త మండలాలను ఏర్పాటు చేయాలన్నారు. గతంలో హుజూరాబాద్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా సాధన కోసం ఎన్నో కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

ఉద్యమానికి ఊపిరి పోసిన అందెశ్రీ పాటలు

శంకరపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అందెశ్రీ రాసిన పాటలు తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశాయని, ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడేలా స్ఫూర్తిని రగిల్చాయని సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి అన్నారు. సోమవారం కేశవపట్నంలో ప్రజాకవి అందెశ్రీ సంస్మరణ సభ నిర్వహించారు. అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో పుస్తకావిష్కరణ

గణేశ్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో బోటనీ విభాగం ఆధ్వర్యంలో మైక్రో బియల్ డైవర్సిటీ, ఎర్లీ ల్యాండ్ ప్లాంట్స్ అనే శీర్షికతో బీఎస్సీ ఫస్ట్ సెమిస్టర్‌కు సంబంధించిన బోటనీ పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులు డాక్టర్ మాధురి, ప్రచురణాధికారి అశోక్ కుమార్, సంపాదకుడు శాస్త్రీ తదూరి, రచయిత డాక్టర్ పడాల తిరుపతి, బోటనీ విభాగాధిపతి తిరుకొవెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చొప్ప దండి నియోజకవర్గంలో పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర మండల ంలోని గట్టుబూత్కూర్, గంగాధర, మధురానగర్, వెంకంపల్లి గ్రామాల్లో రూ.1.15 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, ఆరోగ్య ఉపకేంద్రం, గ్రామపంచాయతీ భవనం, ఎస్సీ బాలుర వసతి గృహ మరమ్మతులు, పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయ ప్రహరీ, బతుకమ్మ ఘాట్, అంబేద్కర్ భవనంలో సీసీ రోడ్డు, ప్రెస్ క్లబ్ నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లె అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు వెలిచాల తిరుమల్‌రావు, ఎంపీడీవో రాము, పీఆర్ డీఈ, గంగాధర సింగిల్ విండో, ఏఎంసీ ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, తోట కరుణాకర్, పార్టీ అధ్యక్షుడు మనోహర్, రామిడి రాజిరెడ్డి, పడాల రాజన్న, తాళ్ల శ్రీనివాస్, ప్రవీణ్, సురేష్, బుర్గు గంగన్న పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే

గంగాధర మండలం కురిక్యాలకు చెందిన భీమనాతిని సత్యవ్వ అనే మహిళ సోమ వారం రోడ్డు ప్రమాదంలో గాయపడి పడిపోయింది. ఆ సమయంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గమనించి వాహనాన్ని ఆపారు. దగ్గరుండి గాయపడిన మహిళను పోలీసు వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

● సంక్షిప్తంగా..

వీణవంక: మండలంలోని పోతిరెడ్డి పల్లికి చెందిన బీఆర్ఎస్వీ నాయకుడు రాపర్తి అఖిల్ తండ్రి ఇటీవల మరణిం చగా కుటుంబాన్ని సోమవారం ఎమ్మె ల్యే కౌశిక్‌రెడ్డి పరామర్శించారు.

చొప్పదండి: చొప్పదండి ప్రాథమిక సహకార సంఘంలో సోమవారం సహ కార వారోత్సవాలను నిర్వహించారు.

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ సోమవారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు.

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో చేతి బ్యాగు(6 గ్యారంటీల ప్రకటనతో ఒక సంచి)ని రేషన్ కార్డు దారులకు ఇవ్వడం లేదని రేషన్ డీలర్లపై సోమ వారం అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌కు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ తెలిపారు.

కరీంనగర్ కల్చరల్: సాయినగర్‌లో సోమవారం శ్రీఅరబిందో సొసైటీ ఆధ్వ ర్యంలో శ్రీమాత (మదర్) మహా సమాధి దినోత్సవం నిర్వహించారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణం లోని శివాలయం (బొమ్మలగుడి)లో సోమవారం లక్ష దీపోత్సవం కార్య క్రమం నిర్వహించారు. భక్తులతో ఆలయంలో సందడి నెలకొంది.

వీణవంక: హుజురాబాద్ నియోజక వర్గంలో ఈ నెల 19న జరిగే బీజేపీ బూత్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు.

నెలాఖరులోగా నల్లా కనెక్షన్ సర్వే పూర్తిచేయాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లా కనెక్షన్ సర్వేను ఈ నెలాఖరులోగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిష నర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమ వారం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమి షనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పాస్ బుక్ లేని నల్లా కనెక్షన్లను ఇల్లీగల్ కనెక్షన్లుగా గుర్తించాలని, వాటికి నోటీసులు జారీ చేయాలని అన్నారు. నోటీస్ గడువులోగా లీగల్‌గా మార్చుకుంటే ఆన్ లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆన్ లైన్ ప్రక్రియ పూర్తవగానే ఆన్‌లైన్ పేమెం ట్ చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, డీఈలు, ఏఈలు ఉన్నారు.

టీడీపీ సీనియర్ నేత కల్యాడపు ఆగయ్య హఠాన్మరణం

కరీంనగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ మాజీ సీఎం ఎన్టీ రామారావు వీరాభిమాని, టీడీపీ సీనియర్ నాయకుడు కల్యాడపు ఆగయ్య (70) హఠాన్మరణం చెందారు. ఆదివారం రాత్రి అస్వస్థతకు గురైన ఆగయ్యను కుటుంబసభ్యులు నగరం లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించ గా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కూమార్తెలు ఉన్నారు.



ఆగయ్య (ఫైల్)

ఆగయ్య మృతి పార్టీకి తీరనిలోటు

- ఏపీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు

తెలుగుదేశం పార్టీకి వెన్నంటి నిలిచిన సీనియర్ నేత కల్యాడపు ఆగయ్య ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని, ఆంధ్రప్రదేశ్ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తదితరులు సంతాపం తెలిపారు.

ఆగయ్య మరణ వార్త కలిచివేసింది

కరీంనగర్ అర్బన్: టీడీపీ నాయ కుడు కల్యాడపు ఆగయ్య మరణ వార్త తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

ఆగయ్య మరణం బాధాకరం

టీడీపీ నేత కల్యాడపు ఆగయ్య మరణం బాధాకర మని మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

విద్యార్థులు అన్ని అంశాల్లో పట్టు సాధించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ పట్టణం భగత్ నగర్‌లోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఓరిస్సన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్డుతూ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీయ డానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి

పుస్తక పఠనం.. ధ్యానం.. కవి సమ్మేళనం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విశ్రాంత ప్రిన్సిపాల్, కాలమిస్ట్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యక్తిత్వాభివృద్ధి తరగతులు నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. సింగమరాజు ఆధ్వర్యంలో ధ్యానం నేర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎంఆర్‌వీ ప్రసాద్ గ్రంథాలయానికి పుస్తకాల వితరణ చేశారు. విద్యార్థులు, పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు. వైరాగ్యం ప్రభాకర్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సరిత, గ్రేడ్-1 లైబ్రేరియన్ అర్జున్, గ్రేడ్-3 లైబ్రేరియన్ సరిత, జూనియర్ అసిస్టెంట్ మల్లయ్య, రికార్డ్ అసిస్టెంట్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

భగత్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ -టెక్నో పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అభినం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు వార్షిక ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్ 17 రాష్ట్రస్థాయి బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాఠశాలలకు చెరందిన విద్యార్థులు డి.మోహన్‌రెడ్డి, సుశాంత్, జాతీయ స్థాయికి ఎంపిక వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మంగళ కలశ యాత్రకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న మహిళలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వైశ్యభవన్‌లో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించే సహస్ర దీప యజ్ఞం, అష్టోత్తర శత కుండముల గాయత్రీ మహాయజ్ఞంలో భాగంగా సోమవారం మంగళ కలశానికి విద్యానగర్, శ్రీరాంనగర్ కాలనీ మహిళలు శ్రీరామ మందిరంలో స్వాగతం పలికారు. పూజల్లో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9005963288, 92480 55754 నంబర్లలో సంప్రదిం చాలని నిర్వాహకులు లక్ష్మీరాజం, వరలక్ష్మీ-రాజేశం, రాజేందర్ తెలిపారు. మార్కెట్‌రోడ్ వేంకటేశ్వర ఆలయం యాత్ర ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. గాయత్రీ మాత, యజ్ఞ విశిష్టతలను వివరించారు.

మున్సిపల్, సుడా నిధులతో అభివృద్ధి పనులు



పనులు ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులతోపాటు సుడా నిధులతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతు న్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. కట్టరాంపూర్‌లోని కార్తికేయ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు 10 లక్షలు మంజూరు చేసి సోమవారం పనులను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర సుందరీకరణపై ప్రత్యేక దృష్టిసారిం చినట్లు చెప్పారు. మాజీ కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సయ్య, నెల్లి నరేష్, దన్న సింగ్, చంద్రయ్య, గంగుల దిలీప్ పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఫార్మసీ వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

తిమ్మాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైత న్య ఫార్మసీ కళాశాలలో 64వ ఫార్మసీ వారోత్సవాలను సోమవారం విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజలకు మందులు, వాటి వాడకం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను ఆదిరోహించాలన్నారు. సైంటిస్టు రాజన్న, కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రామ నరసింహరెడ్డి, హెచ్‌ఓడీ అప్పారావు, చంద్ర మౌళి పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో పీజీ స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కళాశాల కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అంద జేయాలని సూచించారు. సీపీగెట్ -2025 నిబంధనల ప్రకారం స్పాట్ అడ్మిషన్లలో సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

గంగాధర (రామడుగు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌యూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్ అన్నారు. సోమవారం రామడుగు మండలం వెదిర కిమ్స్ లా కళాశాలలో ఓరియంటేషన్ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో న్యా యాన్ని రక్షించేవారు న్యాయ వాదులు మాత్ర మేనన్నారు. యూనివర్సిటీ ఓఎస్‌డీ హరి కాంత్, కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ రవీందర్ రావు, వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన 'రేవా' సభ్యులు

కరీంనగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగుల సంఘం తలపెట్టిన చలో హైదరా బాద్ మహాధర్నా కార్యక్ర మానికి సోమవారం సంఘం (రేవా) సభ్యులు, రిటైర్డు ఉద్యోగులు భారీగా తరలివెళ్లారు. రేవా రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి ప్రారంభించారు.

బొమ్మకల్ ప్రాథమిక పాఠశాలకు విరాళాలు

సైదాపూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని బొమ్మకల్ ప్రాథమిక పాఠశాలకు దాతలు విరాళాలు ఇచ్చారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో నాగార్జున డెయిరీ అండ్ గణపతి సీడ్స్ సీఎండీ ప్రభాకర్‌రావు 72 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు. విశ్రాంత ఎంఈవో ఏలూరి నర్సిరెడ్డి కలర్ ప్రింటర్, ఎన్‌టీపీసీ రిటైర్డ్ జనరల్ మేనేజర్ చిట్టి శ్రీనివాస్‌రెడ్డి సౌండ్ స్పీకర్, రిటైర్డ్ మైనింగ్ సర్దార్ 72 మంది విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు.

డయాగ్నోస్టిక్స్ సెంటర్ల తనిఖీ

సుభాష్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తన బృందంతో కలిసి ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లను తనిఖీ చేశారు. సోమవారం స్పెషల్ డ్రైవ్ టీం సభ్యులతో కలిసి నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థపూర్వ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం-1994, నిబంధనలు-1996 మెడికల్ టర్మి నేషన్ రిప్రొడక్టివ్ టెక్నిక్స్ మార్గదర్శకాలను పాటించాల న్నారు. డీటీటీపీవో ఉమాశ్రీ,ఎంసీహెచ్‌పీవో సనా జవేరియా పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని అస్త్ర కన్వెన్షన్‌లో సోమవారం కట్టరాంపూర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మహిళా హెల్త్ క్యాంప్ నిర్వహించి మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో 50 మంది మహిళా పోలీసులకు క్యాన్సర్ పరీక్షలతోపాటు వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించారు.

కెప్టెన్ లక్ష్మీకాంతరావు జన్మదిన వేడుకలు

గణేశ్‌నగర్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు, మాజీ మంత్రి, బీఆర్ఎస్. సీనియర్ నాయకుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు అమరావతి సలీం ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపాల్ రావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్ నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలో లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సైదాపూర్: సైదాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

చిగురుమామిడి: మాజీ ఎంపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1న శబరిమలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

హుజూరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జనవరి 1న హుజూరా బాద్ నుంచి శబరిమలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ సోమవారం తెలిపారు. హుజూరాబాద్‌లో ప్రారంభమయ్యే బస్సు విజయవాడ, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కంచి కామాక్షి, అరుణాచలం, మధురై, శబరిమల, పళని, శ్రీకాళహస్తి దేవాలయాలకు వెళ్తుందన్నారు. ఒక్కరికి రూ.7500 చొప్పున టికెట్ ధర నిర్ణయించామన్నారు. ఇతర వివరాల కోసం 9959225924, 9704833971 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీఐటీయూ నాయకుల ధర్నా

జమ్మికుంట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని గాంధీ చౌరస్తాలో సీఐటీయూ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జమ్మికుంటలో భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక అడ్డా ఏర్పాటు చేయాలన్నారు. హుజూరాబా ద్ కార్మిక శాఖ కార్యాలయానికి కార్మికులు వెళ్తే పనులు కావడం లేదని, కార్మికులకంటే కార్డులు చేయించే ఏజెంట్ల ద్వారానే పనులు క్లైములు త్వరగా అవుతున్నాయని ఆరోపించారు.

రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో పతకాలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన చదరంగం పోటీల్లో అండర్-8 విభాగంలో దేవేందర్ పాల్‌సింగ్ రజత పతకం, తన్వి కాంస్య పతకం గెలుచుకున్నట్లు అకాడమీ చీఫ్, కోచ్ అనూప్ కుమార్ తెలిపారు.

నిధులు విడుదల చేయండి

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణం, మరమ్మతు కోసం నిధులు విడుదల చేయాలని జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ కోరారు. సోమవారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. నిధుల కొరతతో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిరుపయోగంగా మారిందని పేర్కొన్నారు.

జనావాసాల్లో మద్యం షాపు వద్దు

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ ఎదుట ఆర్‌బీ స్వీట్‌హౌస్ పక్కన ఏర్పాటు చేస్తున్న మద్యం షాపునకు అనుమతులు ఇవ్వవద్దని కోరారు. కశ్మీర్‌గడ్డ ప్రాంత వాసులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

21న మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు

కరీంనగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా కరీంనగర్ పట్టణ, కరీంనగర్ రూరల్ మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును ఈనెల 21న కరీంనగర్ పట్టణంలోని మానేరు హైస్కూల్‌లో నిర్వహించ నున్నట్లు జన విజ్ఞాన వేదిక ప్రకటనలో తెలిపింది. కరీంనగర్ మండలానికి చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చొల్లేటి కిషన్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నా యకులు ఆయన కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అక్రమాలపై విచారణ చేపట్టాలి

శంకరపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ చెక్కుల అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ నాయకుడు శ్రీనివాస్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మానకొండూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 2022 సంవత్సరం నుంచి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం పొందడం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.